

మూల్యాంకనం నుంచి మినహాయించాలి : యుటిఎఫ్

రాయచోటి: మూల్యాంకనం విధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, ఎస్.జాబీర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన విధులను నుంచి చంటి బిడ్డల తల్లులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులు 60 సంవత్సరాలు పైబడి వయస్సు కలిగిన ఉపాధ్యాయులను జిల్లా కేంద్రం నుంచి దూరం ప్రాంతాల వారికి మినహాయింపు నివ్వాలన్నారు. మూల్యాంకన కేంద్రంలో గాలి వెలుతురు ఉండే గదులను ఉపయోగించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీరు, మజ్జిగ ఉపాధ్యాయులకు సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాంతిలేని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు



- 25 ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- అధిక పనిభారంతో అల్లాడుతున్న కార్మికులు, ఉద్యోగులు
- చాలీచాలని వేతనాలతో అవస్థలు
- రెగ్యులర్ కోసం వినతులిచ్చినా ఫలితం శూన్యం
- హామీలు మరచిన ప్రభుత్వం

ప్రజాశక్తి - కడప

ఎపిలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు కనుమరుగయ్యాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా, వారిని శ్రమదోపిడీకి గురిచేస్తున్నా ఉన్నాయి. చాలీచాలని వేతనాలతో వారి జీవితాలు కొట్టుమిట్టాడుతున్నాయి. 25 ఏళ్లుగా పనిచేస్తున్నా వారి జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 23,548 మంది కార్మికులు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో ఎపి ట్రాన్స్‌కోలో 4107 మంది, ఎపిజెన్‌కో 3383 మంది, ఎపిఇపిడిసిఎల్‌లో 5047 మంది, ఎపిఎస్‌పి డిసిఎల్‌లో 7708 మంది, ఎపిసిపిడిసిఎల్‌లో 3303 మంది కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కడప జిల్లాలో దాదాపుగా 2000 మంది పైచిలుకు విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో డిప్లమో, డిగ్రీ, బీ.టెక్, పీజీ విద్య అర్హతలతో 25 ఏళ్లుగా పనిచేస్తున్న వారు ఉన్నారు. వీరికి నెలకు కనీస వేతనం రూ. 20 వేలు కూడా రావడం లేదు. ఇదే విద్య అర్హతలతో రెగ్యులర్‌గా పనిచేసే ఉద్యోగులకు రూ. 60 వేల నుంచి 80 వేల వరకు వస్తుంది. వీరితోపాటు సమానంగా పనిచేసే తమకు ఎందుకు పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25 ఏళ్లుగా అధికారంలో ఉన్న పార్టీలు, ప్రభుత్వ పెద్దలు కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీలు ఇస్తున్నాయే తప్ప వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టిన సమయంలో మన ప్రభుత్వం రాగానే విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగులను రెగ్యులర్ రైస్ చేస్తామని హామీ ఇచ్చారు. వారి వారి విద్య అర్హతలను బట్టి, అనుభవాన్ని బట్టి రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా కూడా హామీ ఇచ్చారు. కానీ మరిచారని కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో ఎన్నాళ్ళు ఈ ఎట్టి చాకిరి అంటూ ప్రశ్నిస్తున్నారు. ఉభయ జిల్లాలోని విద్యుత్ కార్యాలయం ఎదుట తమను రెగ్యులర్ చేసి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని పలుమార్లు కార్మికులు, ఉద్యోగులు ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేకపోవడం దారుణం.

ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను తెలంగాణ హైకోర్టు ఎదురు బదులు లేదని గమనించి వారిని ఇండస్ట్రియల్ యాక్ట్ కింద రెగ్యులరైజ్ చేయవచ్చునని తీర్పునిచ్చింది. దానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను 2017లో విద్యుత్ సంస్థల్లో విలీనం చేసుకుంది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చేసరికి రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా చేసేందుకు ఇటు విద్యుత్ యాజమాన్యం కానీ, ప్రభుత్వాలు కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయి. ఇది ఎంతవరకు సమంజసమని కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి అలవెన్సు, ఉద్యోగ భద్రత లేకుండా, విద్యుత్ సంస్థనే నమ్ముకొని కొన్నేళ్లుగా పనిచేస్తున్నా నెలకు రూ. 20 వేలు కూడా రాకపోతే జీవనం జీవనం ఎలా సాగించాలో అర్థం కావడం లేదని వాపోయారు. పెరిగిన ధరలతో కుటుంబాలు అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ శ్రమను, విద్య అర్హతలను బట్టి, అనుభవాన్ని బట్టి కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రెగ్యులరైజ్ చేస్తారన్న ఆశతో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.



కడప విద్యుత్ భవన్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు (ఫైల్‌ఫోటో)

తక్షణం రెగ్యులర్ చేయాలి..



ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను తక్షణం రెగ్యులరైజ్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. థర్డ్ పార్టీ విధానం తీసివేయాలి అని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, విద్యుత్ సంస్థ యాజమాన్యానికి ఇప్పటికే చాలా మార్లు వినతి పత్రాలు అందజేశాం. కానీ స్పందన లేదు. విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీని వాసుల రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా వినతి పత్రాలు సమర్పించాం. వారు స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఇచ్చిన హామీని, మాటను నిలబెట్టు కోవడం మరిచారు. నిత్యావసర సరుకుల ధరలు మూడు రేట్లు పెరిగాయి. అందుకు తగ్గట్టుగా కాంట్రాక్టు కార్మికులకు ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకపోవడం చాలా దారుణం. ఇప్పటికైనా యాజమాన్యం ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చి కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నాం.

- ఎన్.శివశంకర్, డిస్కం అధ్యక్షులు, యుఇఇయు, కడప.

అశ్వవాహనంపై శ్రీకోదండరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట



శ్రీ కోదండ రామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శుక్రవారం రాత్రి స్వామివారు అశ్వవాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమై 9 గంటలకు ముగి సింది. ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం కాళీయ మర్దనాలంకారంలో రామ ఎలవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు వేడుకగా అభిషేకం చేశారు. సాయంత్రం 5.00 గంటల నుండి 6.00 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామివారు యాత్రికులకు దర్శనమిచ్చారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తిభావాన్ని పంచాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.



గ్రామోత్సవం ముందు కళాకారుల నృత్యాలు

రేపు చక్రస్నానం : శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శనివారం ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

9న పుష్పయాగం : శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో 10వ రోజు ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి - రాయచోటి

12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మిట్ట కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పిఆర్‌టియు కార్యవర్గ సమావేశం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఆర్‌టియు సంఘ నిర్మాణంలో భాగంగా మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులదే క్రియాశీలక పాత్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిటీ వేసి రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగ కార్మిక పెన్షనర్ల మన్ననలు పొందాలన్నారు. కమిటీలతో కాలయాపన చేయకుండా 2024 లో జరిగే ఎన్నికలలోపు పిఆర్‌సిని అమలు చేసే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతం ఇవ్వాల్సిన డిఎలను వెంటనే ప్రకటించాలన్నారు. బదిలీలపై ఉన్న కోర్టు కేసులను వెంటనే పరిష్కరించి బదిలీలను చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఆదివారం కడపలో నిర్వహించబోయే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అందరూ విరివిగా పాల్గొని దిగ్విజయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫణీంద్ర, రోశయ్య, యువరాజనాయుడు, వేణుగోపాల్, నరసింహారెడ్డి, రామాంజనేయులు, ఉమామహేశ్వరరావు, విశ్వనాథ్ లక్ష్మీ రమణయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

నాటు సారా తయారు చేస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నాటు సారా అక్రమ తయారు చేస్తే చర్యలు తీసుకోవాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అన్నారు. శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్ఇబి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నాటుసారా అక్రమంగా తయారు, రవాణా చేయకుండా ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి నిషేధించాలని పేర్కొన్నారు. నాటు సారా తాగడం వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నాటుసారా అక్రమ తయారీ రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి వీలైనంత వరకు తగ్గించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా మద్యం తరలించకుండా చెక్ పోస్టుల వద్ద తనిఖీలు పెంచాలని చెప్పారు.నాటు సారా అక్రమ విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రాజ్ కమల్ ఎస్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలంలోని పేదలకు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొర్లకుంటలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. పిల్లలను బడికి పంపలేక వుండటానికి సరిగా ఇళ్లులేక బాధపడుతునారు. 8వ అసైన్‌మెంట్ కమిటీలో పేదలందరికీ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు భూములు పంపిణీ చేయకపోతే ఈ నెల 10వ తేదీన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ రైతు సంఘం అధ్యక్షులు సి.చెంగయ్య, సి.హరి ప్రసాద్, సిఐటియు మండలం కార్యదర్శి వెంకటరమణ, చెన్నకేశవులు, కెవిపిఎస్ నాయకుడు పెంచలయ్య, గ్రామస్తులు పాల్గొనారు.



మాట్లాడుతున్న జయరామయ్య

ఆరోగ్యమే మహాభాగ్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయచోటి ఏరియా ఆస్పత్రిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి నేతాజీ సర్కిల్ మీదుగా బస్టాండ్ వరకు కొనసాగింది. 'ఆరోగ్యమే మహాభాగ్యం, వ్యాయామం చేయండి.. ఆరోగ్యంగా ఉండండి, రోజూ నడక ఆరోగ్యానికి చాలా మంచిది ,తెల్ల బియ్యం మానండి, ముడి బియ్యం వాడడండి, ఇంటి వంటకం ఆరోగ్యానికి మంచిది' అనే నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ రోజూ, స్విమ్మింగ్, జాగింగ్, యోగా వంటి ఏదో ఒక వ్యాయామం చేయాలని తెలిపారు. అనంతరం డిసిహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ తగ్గించాలని, పాలిష్ పట్టిన బియ్యం, గోధుమపిండి తగ్గించి తృణ ధాన్యాలను ఎక్కువగా వాడాలన్నారు. మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి దేవశిరోమణి ,హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, రాజగోపాల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణ, రామకృష్ణ యాదవ్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, విశ్వనాథరెడ్డి, టీబీ సిబ్బంది గంగన్న ,నగేష్ , ఏరియా హాస్పిటల్ సిబ్బంది, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** జీవనశైలిలో మార్పులతో అందరికీ ఆరోగ్యం లక్ష్యాన్ని సాధించవచ్చునని జిల్లా డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. ప్రపంచ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లిలో ప్రజలకు అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం ప్రతి ఐదు మందిలో ఒకరు ఏదో ఒక అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్నారని, అసంక్రామిత వ్యాధులు అంటే ఒకరి నుండి మరికరికి వ్యాప్తి చెందవని, ఆ జబ్బులు షుగర్, బిపి, కాన్సర్, థైరాయిడ్, పక్షవాతం, గుండె సంబంధ జబ్బులు, దంత, కంటి సమస్యలు, స్థూలకాయం వంటివని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ అసంక్రమిత జబ్బులన్నిటికీ ముఖ్య కారణాలు గురించి వివరించారు. ప్రతి రోజూ క్రమం తప్పని వ్యాయామం, యోగా చేయడంతో ఒత్తిడి, ఆలోచనలు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేడికుర్తి ఆరోగ్య పర్యవేక్షకులు హేమలత, ఎంఎల్‌హెచ్‌పి భాను, ఎఎన్ఎంలు మాధవి, పార్వతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. **ములకలచెరువు:** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రాయచోటి : వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆధ్వర్యంలో ఆసుపత్రి నుండి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ షకీలాబేగం, ఎంపిహెచ్ఇఒ రమణయ్య, ఎంపిహెచ్ఎస్ అమరావతి, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, మునిరత్న, బి.లక్ష్మీ,కళావతి, సల్మా పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రంలో కలకడ, ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రపంచ ఆరోగ్య జనాత్వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ రెండు కేంద్రాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించి, ఆరోగ్యంపట్టు ప్రతి ఒక్కరు శ్రద్ధ తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు :**ప్రతి సంవత్సరమూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాన కల్పించేవారు. ఈ ఏడాది శుక్రవారం ప్రపచం ఆరోగ్య దినోత్సవాన్ని వైద్య సిబ్బంది పూర్తిగా విస్మరించినట్లు తెలుస్తోంది. ఏ ఒక్క అధికారి కానీ, సిబ్బంది కానీ మండల కేంద్రంలో ఏ ఒక్క కార్యక్రమం నిర్వహించకపోవడంపై పలు విమర్శలు విన్పిస్తున్నాయి. **తంబళ్లపల్లి :** ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు ఉంచాలని డాక్టర్ మునికుమార్ తెలిపారు. కోసవారిపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఎంపిహెచ్ఇఒ రమణ, సిహెచ్ఒ సుమతి, ఫార్మసిస్టు వేమారెడ్డి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** అందరి ఆరోగ్యం మనందరి బాధ్యతని తలుపుల రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌రెడ్డి డాక్టర్ కార్తీక్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ శేషగిరి బాబు, డాక్టర్ చంద్ర శేఖర్ నాయక్, డాక్టర్ శివయ్య, డాక్టర్ రామాంజి, నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది, జయలక్ష్మి, హెచ్ఇలు కొండయ్య, ఉషారాణి, హెల్త్ సూపర్వైజర్లు కుసుమ కుమారి, పవన్, సిహెచ్ఒలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ప్రజాశక్తి - రాజంపేట టౌన్

మండల పరిధిలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాల్లో గుడ్‌ఫ్రైడేను పాస్టర్లు ఘనంగా నిర్వహించారు. మండలంలోని టి.అగ్రహారం చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. యేసుక్రీస్తు చూపిన ధర్మమార్గంలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, డిసిసి చైర్మన్ దండు గోపి, జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు బొజ్జ పెంచలయ్య పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:**స్థానిక సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ విజయమోహన్‌రెడ్డి ఏసుప్రభు జీవిత చరిత్ర ఆయన ప్రజల కోసం శిలువ మోసిన త్యాగం గురించి వివరించారు. అనంతరం ఉపవాసం ఉన్న భక్తులకు మజ్జిగ, అన్నదానం నిర్వహించారు. **గాలివీడు :** కార్మెల్ ప్రార్థనా మందిరంలో దైవ సేవకుడు పాల్ వీర నాగయ్య ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే శుభ సందర్భంగా ఏసుక్రీస్తు ప్రభు సిలువలో పొందిన శ్రమలుల మరణాన్ని గురించి వివరించారు. ఉపవాసం ఉండేవారికి మజ్జిగ పంపిణీ చేశారు.కార్యక్రమంలో బాధ్యత సహోదరులు రత్నకుమార్, జయన్న పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** పట్టణంలోని సిఎస్ఐ, జెసియం చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సునీల్ వరకుమార్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. భక్తుల కోసం శీతల పానీయాలు, మజ్జిగ, పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ జెఇ.భక్తవత్సలం, ట్రెజరర్ ఆనంద్ కుమార్, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** సిఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పంచాలమర్రి, భద్రయ్యాగారిపల్లి, ఉప్పులూర వాండ్లపల్లి, చింపిరెడ్డి వాండ్లపల్లెలోని చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పోర్డ్ నరసింహులు, భాస్కర్, సుజాత, రామలక్ష్మి, మేరమ్మ, సులోచన సంఘస్తులు పాల్గొన్నారు.



రాయచోటి : జోన్-4 సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

జోన్-4 సమావేశానికి హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నెల్లూరు నగరంలోని శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జోన్-4 సమీక్ష సమావేశానికి జిల్లా నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, అన్ని మండలాలలోని పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. **రాయచోటి:** రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష కుమార్‌రెడ్డి పనితీరు భేష్ అని మాజీ ముఖ్య మంత్రి నారాచంద్ర బాబునాయుడు కొనియాడారు. శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన జోన్-4 సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. రమేష్ రెడ్డి తెలుగుదేశం పార్టీ అప్పజెప్పిన బాధ్యతలని సక్రమంగా పూర్తి చేస్తూ జోన్-4 నియోజకవర్గాల్లో రెండవ స్థానంలో నిలిచారని తెలిపారు. జోన్-4లో 35 నియోజకవర్గలలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ' కార్యక్రమాలలో 2వ స్థానం ఉన్నందున చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారున్నారు.



రాజంపేట : సమావేశంలో పాల్గొన్న బత్యాల

రాజ్యాంగ రక్షణ రణభేరి సభకు తరలిరండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు విసికె పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో మదనపల్లిలో ఈ నెల 8న జరుగబోయే రాజ్యాంగ రక్షణ రణభేరి సభకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం మైనార్టీలు, బహుజనలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని బాస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం రాజ్యాంగ రక్షణ రణభేరి కరపత్రాలను పోస్టర్స్‌ను భారతీయ అంబేద్కర్ సేన బాస్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా జరిగే ఈ సభకు చిదంబరం ఎంపీ తిరుమావలవన్, కర్నాటక మాజీ స్పీకర్ రమేష్, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగన్న, సచిన్, పలక వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు కందికట్టల జాతర

ప్రజాశక్తి - గాలివీడు

పేరంపల్లిలోని ఆసర్ల గంగమ్మ కందికట్టల జాతర శని, ఆదివారాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకిరంచారు. ఐదు చాందిని, ఆరు టెంకాయ బండ్లను ఏర్పాటు చేశారు. బండ్లు ఆలయం చుట్టూ ప్రదర్శన చేసి భక్తులు పూజలు నిర్వహిస్తారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రశాంతంగా జాతర నిర్వహించుకోవాలని ఎస్ఐ వెంకట్‌శివకుమార్ పేర్కొన్నారు.



విద్యార్థికి కోడింగ్ కార్డు పంపిణీ చేస్తున్న నరసింహారెడ్డి

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్


ప్రజాశక్తి - రాయచోటి

స్కౌట్స్ శిక్షణ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతుందని స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. కడప నగరం శంకరాపురంలోని స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్కౌట్ విద్యార్థుల రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశ భక్తి పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్ సర్టిఫికెట్ కలవారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. గవర్నర్ ద్వారా రాజ్య పురస్కార్ సర్టిఫికెట్ పొందిన తర్వాత రాష్ట్రపతి సర్టిఫికెట్ పొందేందుకు కూడా శక్తి వంచన లేకుండా విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు కోడింగ్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్ఓసి (లీడర్ ఆఫ్ ది కోర్స్) బి.శివ నాగిరెడ్డి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, శివప్రసాద్, స్కౌట్ మాస్టర్లు బాలసుందరం, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో కసిరెడ్డి గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చింటూ, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణలు మధ్య కమనీయంగా రమణీయంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ గొబ్బిళ్ళ శ్రీనాథ్, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, వైసిపి నాయకులు గడికోట వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి స్వామి ఎలుమలై పాల్గొన్నారు.



ఫుడ్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో యువకులు

ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి-గుర్రంకొండ

హెల్పింగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ 10వ వార్షికోత్సవం పురస్కరించుకుని రాటకొండ శ్రావ్య సహకారంతో ఫుడ్ బ్యాంక్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదల ఆకలి తీర్చేందుకు యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందదాయక విషయమని ఎఎస్ఐ నర్సింహులు పేర్కొన్నారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ అన్నార్తుల ఆకలి తీర్చాలనే గొప్ప సంకల్పంతో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ బ్యాంక్ సేవలు ప్రతి ఒక్కరికీ తెలిసేలా అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ గుర్రంకొండ ఇన్‌చార్జి మొఖద్దార్, సభ్యులు మగ్దయం, శేఖర్, యూసుఫ్, కరీం, ఆబిద్, షోహైబ్, తకి, రఫీ, సాదిక్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న యోగేశ్వర్‌రెడ్డి, అర్జున్‌రాజు

గాలిగోపురం అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల కేంద్రంలోని తాళ్లపాక గ్రామ పంచాయతీలో ఉన్న సిద్దులపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం గాలిగోపురం నిర్మాణ అభివృద్ధికి తన వంతు సహాయంగా అర్జున్ రాజు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యోగేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యోగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గోపురం నిర్మాణానికి విరాళం ఇవ్వడం హర్షణీయమన్నారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బాలరాజు శేఖర్ రాజు, నూక మధుసూదన్‌రెడ్డి, బాలరాజు సుమన్, గ్రామ పెద్దలు బలరాం రాజు, శేషం రాజు పాల్గొన్నారు.

బిసి సేన జిల్లా అధ్యక్షులుగా నాగరాజు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసి సేన జిల్లా అధ్యక్షులుగా నాగరాజు ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో అన్నమయ్య, చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిసి సేన రాష్ట్ర కో-ఆర్డినేటర్ రంగనాథ్, రాష్ట్ర అధ్యక్షులు శొంఠి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతా కృష్ణారావు, మహిళ ప్రధాన కార్యదర్శి ఏలూరి విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తబాబు, రాష్ట్ర నాయకులు వున్నా రామచంద్ర రావ్, బాపట్ల జిల్లా అధ్యక్షులు వినుకొండ శ్రీనివాస రావు, కుమార్, మదన్, మహేష్, నజీర్, వెంకటేష్, మణి, శేఖర్, ఆశోక్, సుధీర్, వినయ్, పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షులు నడిగడ్డ వెంకటరమణ, అన్నమయ్య జిల్లా యువజన అధ్యక్షులు ఓబులవారిపల్లె నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సమస్యల పరిష్కారానికే 'జగనన్నే మా భవిష్యత్తు' : జడ్పీ చైర్మన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడానికే 'జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగనన్న' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకారంపల్లి గ్రామ పంచాయతీలోని మునక్కాయపల్లి, రాజంపేట మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్, నారపురెడ్డిపల్లి, ఎర్రబల్లెలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను గురించి వివరించి గత పాలనకు, జగన్మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, కౌన్సిలర్ కళావతి, ఎంపిటిసి అలుగునూరు వరదరాజు, రామ్మోహన్ నాయుడు, శ్రీను, రఘురాంరెడ్డి, నాగేశ్వర్, నజీర్‌బాష, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని పాటూరు పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, పాటూరు సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూప మోహన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల సచివాలయ ఇన్‌ఛార్జి కన్వీనర్ కరీముల్లా ఖాన్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని బూత్ కమిటీ కన్వీనర్లకు ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి రెడ్డయ్య ఆధ్వర్యంలో కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపిటిసి సభ్యులు దస్తగిరి, లక్ష్మీనారాయణ, జగన్మోహన్‌రెడ్డి, సర్పంచులు వెంకటనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, సిద్ధక నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ దుర్గయ్య, రామచంద్ర, కొండా ప్రసాద్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, ఉప సర్పంచ్లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రాజబాబు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక షాదీ మహల్‌లో నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రారంభమైంది. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సురేంద్ర, జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, పిటిఎం ఎంపిపి మహమ్మద్, సర్పంచులు రవి, రఘు, ఆదిప్ప గౌడ్, ఎంపిటిసిలు నాగరత్న, జయలలిత, సుబ్బయ్య నాయుడు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ నక్క మహేష్ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** జగనన్నే మా భవిష్యత్తు అని ప్రజలు అంటున్నారని ప్రభుత్వ విప్ కోరముట్ల శ్రీనివాసులు అన్నారు. జగనన్నే మా



రాజంపేట : పుస్తకం పంపిణీ చేస్తున్న మేడా, ఆకేపాటి

భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్ రాజు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సర్పంచులు హరికృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, ఎంపిటిసిలు జనార్ధనరాజు, మహేశ్వర్‌రెడ్డి, బండారు మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, కరీముల్లా, రవుఫ్ పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండలంలో వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథరెడ్డి, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, మూరి శంకర్ రెడ్డి, సయ్యద్ ముస్తాక్, రిజ్వాన్ పాల్గొన్నారు. **రామసముద్రం :** మండలంలోని కుదురుచీమనపల్లి పంచాయతిలో వైస్ ఎంపిపి రమణారెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, మినికి సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, గంగప్ప, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** రాష్ట్రంలో ప్రజలు మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో ఉన్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు సహదేవరెడ్డి, నాయకులు చింతల శివానందరెడ్డి, నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, రామక్రిష్ణారెడ్డి, నరసింహులు, రఘు, రమేష్, రవి, రాయుడు, ఆనంద, సాధిక్ పాల్గొన్నారు.

నిలకడగా మినుము ధరలు

పంట మార్పిడి పట్ల రైతుల్లో ఆసక్తి.. ఏడాదికేడాది పెరుగుతున్న సాగు



అమ్మకం కోసం లోడు చేస్తున్న మినుములు

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన మినుము పంట నూర్పిడి పూర్తయింది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది మినుము సాగును రైతులు అధికంగా చేపట్టారు. మినుములకు కేంద్ర ప్రభు త్వం ఈ ఏడాది రూ.6 వేలు మద్దతు ధరగా నిర్ణయించింది. కానీ, ప్రయివేట్ వ్యాపారులు దాదాపు రూ.7 వేలకు పైగా ధర ఇచ్చి పంటల కొనుగోలు చేస్తున్నారు. రెండు నెలలుగా ధరలు నిలకడగా ఉన్నాయి. క్వింటా ధర రూ.7 వేల నుంచి రూ.8వేల లోపు పలుకుతోంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువగా వస్తుండడంతో మినుములు లాభసాటిగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మినుములు ఎకరాకు 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. గత ఖరీఫ్‌లో వరి సాగు చేసి దిగుబడి, ధరలు సరిగా లేక రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో మినుము సాగు ఖర్చు తక్కువని రైతులు ఆసక్తి చూపారు. ప్రస్తుతం ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో 17,552 వేల ఎకరాల్లో మినుము సాగైంది. ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతులు పేర్కొం టున్నారు. తక్కువ పెట్టుబడి, వ్యవసాయంలో వస్తున్న మార్పులు, మార్కెట్ ధరలకు అను గుణంగా రైతులు పంటల సాగు చేపడుతున్నారు. జిల్లాలో వరి తర్వాత వేరుశనగ, శనగ ప్రధాన పం టలు. కానీ, మూడేళ్లుగా ఈ పంటల సాగు ఆశా జనకంగా లేవు. వాతావరణంలో మార్పుల కార ణంగా పంట దిగుబడులు తగ్గిపోవడం, నాణ్యత లేకపోవడం, జింక్ లోపంతో పెట్టుబడి సమస్య ఎక్కువ కావడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది వేరుశనగ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే సాగకు ఖర్చు ఎక్కువ. మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువగానే ధరలు వస్తుండడం, వ్యవసాయ అధికారులు కూడా పంట మార్పిడి చేయాలని సూచిస్తున్నారు. గతంలో జిల్లాలో సాగునీటి వనరులు సరిగా లేని సమయంలో వేరుశనగే ప్రధాన పంటగా రైతులు సాగు చేశారు. గత సీజన్‌లో మినుము సాగు 5,954 ఎకరాల్లో కాగా, ఈ ఏడాది ఏకంగా 17,552 ఎకరాల్లో సాగైంది. గతేడాది కంటే 12వేల ఎకరాల్లో మినుము సాగు పెరిగింది.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పాతదే : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కొత్తది కాదని, 104 పథకానికి పేరు మార్చి డబ్బా కొట్టుకోవడం వైసిపికి పరిపాటిగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించి వైద్య సేవలు, మందులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో ఆరోగ్య రంగం అనారోగ్యం పాలైందన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించడమే కాకుండా కేటాయించిన నిధులు కూడా ఖర్చు పెట్టడం లేదన్నారు.ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీ అయిందన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సెప్టెంబర్ నుండి నేటి వరకు రూ.750 కోట్లు బిల్లులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కింద రోగులను చేర్చుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది, పరికరాలు, మందుల కొరత తీవ్రంగా ఉందన్నారు. సిఎం సొంత ఊరిలోని పులివెందుల పట్టణంలో 100 పడకల ఆసుపత్రిలో 23 మంది డాక్టర్లకుగానూ కేవలం 10 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. వేంపల్లెలోని 50 పడకల ఆసుపత్రిలో 12 మంది డాక్టర్లకుగానూ నలుగురు మాత్రమే వైద్యులు ఉన్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో డాక్టరే ఇంటివద్దకెళ్లి వైద్యసేవలు చేస్తారనడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, సుబ్రమణ్యం, అమర్, వెంకటేష్, సుబ్బరాయుడు, రవి, శివ పాల్గొన్నారు.



వైద్య సేవలపై డాక్టర్‌ను అడుగుతున్న తులసిరెడ్డి

మత్తులో జోగుతున్న యువత

- తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను నేడు వైసిపి ప్రభుత్వం తన నాలుగేళ్ల పాలనలో మత్తు ఆంధ్రగా మార్చిందనితెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువతను మత్తుకు బానిసలుగా చేసిందని శుక్రవారం ఆయన స్థానిక గాంధీరోడ్డులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అవినీతి నాయకుల చేతిలో రాష్ట్రాన్ని పెట్టి బిడ్డల బంగారు భవిష్యత్తును ఎలా ఆశిస్తున్నారన్నారు. చిన్ననాటి నుంచి పిల్లలకు చదువు, సంస్కారం, మంచి అలవాట్లు, ప్రవర్తన నేర్పాలన్నారు. అప్పుడే కుటుంబాలకు, దేశానికి మంచి తరాలను అందించగలమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపుపై హర్షం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వరుసగా మూడు రోజులు బ్యాంకు సెలవుల నేపథ్యంలో ఎపి జెన్‌కో ఉద్యోగుల మార్చి నెల వేతనం గురువారం చెల్లించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి యాజమాన్యానికి, సహరించిన బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అఖిలపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-కడప అర్బన్

పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ అచ్చెన్న హత్యపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని శనివారం ఉదయం 10 గంటలకు నగరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రేపు బిసి సంక్షేమ సంఘం పునర్నియామక సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక వేంపల్లె రోడ్డులోని వెల్‌కమ్ సప్లయర్స్ ప్రాంగణంలో ఆదివారం బిసి సంక్షేమ సంఘం పునర్నియామక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి రెడ్డెయ్య తెలిపారు. సమావేశానికి మండలంలోని బిసిలు పాల్గొనాలని ఆయన కోరారు.

పెండింగ్ డిఎలను వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డిఎలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ కోరారు. ఎస్‌టిఎఫ్ మండల స్థాయి సమావేశం శుక్రవారం స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్‌టిఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

మంత్రి రజనీకి ఆస్కార్ అవార్డు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మంత్రి విడదల రజినికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని, స్క్రిప్ట్ రాసిన వారు చాలా చక్కగా రాసి ఇస్తే, దానిని మీరు చాలా అద్భుతంగా చదివి ప్రజలకు వినిపించారని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న టిడిపి బిసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డిని పొగడడం, చంద్రబాబును విమర్శించడం మంత్రులకు అలవాటైపోయిందని చెప్పారు. భవిష్యత్తు టిడిపిది అన్నది మంత్రులు గమనించాలని హితవుపలికారు. సమావేశంలో డివిజన్ ఇచ్ఛార్జులు బండి జయ శేఖర్, దేరింగ్ల శివ, గాజుల పల్లె రాఘవ, శ్రీనివాసులు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి యోగా రత్న పురస్కారం

ప్రజాశక్తి- కలసపాడు

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న యోగా టీచర్ బి.ఎస్. నారాయణరెడ్డికి ఒసి సంఘర్షణ సమితి వారు 2023 ఉగాది పండుగను పురస్కరించుకొని యోగారత్న పురస్కారం అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డును ఈ నెల 9న తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని రాఘవ నిలయం (రెడ్డి సత్రం)లో ఓసి సంఘర్షణ సమితి పదవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా అవార్డు అందజేస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన రాఘవ నిలయం కమిటీ సభ్యులకు, ఓసి సంఘర్షణ సమితివారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎపియుఎస్ నాయకులు

ఉపాధ్యాయులను వేధించడం తగదు

ప్రజాశక్తి - రాయచోటి

ఉపాధ్యాయులను వేధించడం తగ్గదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం ఎపియుఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను ఏదో ఒక కారణం చూపి వేధింపులకు గురించేస్తుందని, ఉన్నతాధికారులు పని ఒత్తిడి పెంచి ఉపాధ్యాయులను ఆందోళనకు గురించేయడం సరికాదన్నారు. అనంతరం రాయచోటి, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాలలోని కొన్ని మండలాలకు ఎపి యుఎస్ మండల కమిటీలను ఎన్నికల అధికారి నాగేశ్వరరావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయచోటి మండల కన్వీనర్ గామధుసూదన్, కో- కన్వీనర్‌గా రాంప్రసాద్, చిన్నమండ్యెం మండల అధ్యక్షులుగా నాగరాజు, ప్రధాన కార్యదర్శి గా రెడ్డి ప్రసాద్, కోశాధికారి గా రాచరాయుడు, మండల ఉపాధ్యక్షులుగా పురుషోత్తంనాయక్, మోహన్ నాయక్, కార్యదర్శులు గాచెన్నకేశవరెడ్డి, సంబేపల్లి మండల అధ్యక్షులుగా పి.బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా గణేష్, వీరబల్లి మండల కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్‌గా హరీష్, రామాపురం మండల అధ్యక్షులుగా శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, టి.సుండుపల్లి మండల కన్వీనర్‌గా మణికంఠ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలో శుక్రవారం ఐఎఫ్‌టియు అన్నమయ్య జిల్లా నాయకులు పోరెడ్డి రమణారెడ్డి, మావులూరి విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఐఎఫ్‌టియు అఖిల భారత ఏడో మహాసభలను విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రయివేటీకరణ కార్మిక హక్కుల కాలరాతకి వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16, 17, 18న తిరుపతిలో భారీ ఎత్తున మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు ఆంజనేయులు, నారాయణ, చాను, మహబూబ్ బాషా, రఫీ, ఇర్ఫాన్, రామకృష్ణ, రాళ్లపల్లి, బావాజీ పాల్గొన్నారు.



మీటర్ సినిమా విడుదల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అభిమానులు

హీరో అబ్బవరం కిరణ్ అభిమానుల హంగామా

ప్రజాశక్తి-పీలేరు

హీరో కిరణ్ అబ్బవరం నటించిన మీటర్ సినిమా విడుదల సందర్భంగా శుక్రవారం పీలేరులో అభిమానులు హంగామా చేశారు. థియేటర్లో హీరో కిరణ్ అభిమాన సంఘ సభ్యులు సందడి చేశారు. థియేటర్ ముందు టపాకాయలు కాల్చి 15 కిలోల కేక్ కట్ చేసి కిరణ్ అబ్బవరం అభిమానులకు, ప్రేక్షకులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిరణ్ అబ్బవరం అన్నమయ్య జిల్లా ముద్దు బిడ్డని, అతను హీరోగా నటించిన ఎస్ఆర్ కళ్యాణ మండపం, వినారో భాగ్యము విష్ణుకథ సినిమాలు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. తెలుగు సినిమా రంగంలో ఒక మంచి నటుడు జిల్లా నుండి కూడా రావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిరణ్ అబ్బవరం అభిమాన సంఘం నాయకులు పులి సత్యనారాయణరెడ్డి, ధనుష్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అమర్నాథరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సినిమా థియేటర్ యాజమాన్యం సాంబశివా రెడ్డి, మేనేజర్ ధర్మేంద్ర, బాబు పాల్గొన్నారు.

యాచకులు, అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హెల్పింగ్ హాండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు వెంకటరమణ శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేష్ సహకారంతో రాయచోటి పట్టణ పరిధిలోని యాచకులు, అనాథలు, వృద్ధులకు అన్నదానం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు శశిధర్, సభ్యులు మహేష్, రెడ్డయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్



ఘర్షణపై విచారణ నిర్వహిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

ఘర్షణపై విచారించిన ఎస్ఐ

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని కోటగుడిబండ ఎల్లంగుడిబండ పంచాయతీలో జరిగిన ఘర్షణపై ఎస్ఐ తిప్పేస్వామి గ్రామస్తులతో విచారించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఎల్లంగుడిబండ దళితవాడకు చెందిన నగిరిమడుగు సాంబశివను ఆయన అన్న భార్య నగిరి మడుగు వీర నాగమ్మ మచ్చు కొడవలితో గురువారం సాయంత్రం నరికిన సంఘటన పాఠకులకు తెలిసిందే. ఈ క్రమంలో ఎస్ఐ తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి దర్యాప్తులో భాగంగా విచారించినట్లు తెలిపారు. విచారణలో గ్రామస్తులు చెప్పిన వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

కలకడ: ఘర్షణపడి వ్యక్తిని గాయపరచడంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మండలంలోని కె.దొడ్డిపల్లికి చెందిన కోట రెడ్డప్ప నాయుడు గురువారం దేవళంపేట సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారతానికి వెళుచుండగా బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లికి చెందిన ఎర్రయ్యగారి ఆనంద గతంలో ఉన్న పాత కక్షల కారణంగా రెడ్డప్ప నాయుడును అడ్డుకుని దాడిచేశారని తెలిపారు. రెడ్డప్ప నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.